క్లుప్తంగా

శ్రీమఠంలో కన్నడ నటి



అక్షింతలు అందుకుంటున్న సినీ నటి పవిత్ర గౌడ

మంత్రాలయం : శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థం గురువారం కన్నడ నటి పవిత్ర గౌడ మంత్రాలయం విచ్చేశారు. ముందుగా ఆమె గ్రామ దేవత మంచాలమ్మకు అర్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావన దర్శనం చేసుకుని పూజలు నిర్వహించారు. అలాగే ఊంజల మంటపంలో రాయరు ప్రతిమను దర్శించుకుని ధార్మిక సహాయ అధికారులు వ్యాసరాజాచార్ చేతుల మీదుగా అక్షింతలు అందుకున్నారు. భక్తులు ఆమెతో సెల్ఫీలు దిగడానికి ఆసక్తి చూపారు.

మిత్రుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 18వ వార్డులో నివాసముంటున్న క్రిష్టయ్య క్యాన్సర్‌తో బాధపడుతుండటంతో నందవరం మండల కేంద్రంలో హైస్కూల్‌లో ఆయనతో పాటు చదువుకున్న 1983–84 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. పూర్వ విద్యార్థులైన మృత్యుంజయగౌడ్, కానిస్టేబుల్ భీమన్న, ఉసేని,విజయ్‌కుమార్, బసవరాజులు ఆయనకు రూ.22వేల నగదును గురువారం క్రిష్టయ్యకు అందజేశారు. నాటి పూర్వ విద్యార్థులు ఆయనకు సహాయసహకారాలు అందించాలని కోరారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పూడికతీత పనులను పరిశీలిస్తున్న చైర్మన్ మహమ్మద్‌గౌస్

ఆదోని టౌన్: మహాయోగి లక్ష్మమ్మవ్వ జాతరను పురస్కరించుకుని ఆదోని పట్టణంలో షరాఫ్‌బజార్, వన్‌టౌన్ పరిధిలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు జరుగుతున్నాయి. మున్సిపల్ సిబ్బంది చేపడుతున్న పారిశుద్ధ్య పనులను గురువారం ఆదోని మున్సిపల్ చైర్మన్ మహమ్మద్‌గౌస్ పరిశీలించారు. జాతర సమయంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. శుభ్రత, తాగునీటి సమస్య రానివ్వొద్దన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు



విద్యుత్ శాఖ డీఈ, ఏఈతో చర్చిస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో విద్యుత్ పరమైన సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. గురువారం విద్యుత్ శాఖ డీఈ నాగేంద్రప్రసాద్, ఏఈ ప్రసన్న అంజనేయులుతో కలిసి పట్టణంలోని పార్క్ రోడ్, సోమప్ప సర్కిల్ గోనెగండ్ల రోడ్డు తదితర ప్రాంతాల్లో వున్న ఐరన్ పోల్‌లను తొలగించేందుకు పరిశీలించారు. ఇనుప స్తంభాలను తొలగించి వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ ఈసందర్భంగా తెలిపారు.

కౌతాళం ఏపీఓగా మహమ్మద్ రఫీక్



కౌతాళం: మండల ఏపీఓగా గురువారం మహమ్మద్ రఫీక్ బాధ్యతలు చేపట్టాడు. ఇక్కడ పని చేస్తున్న ఏపీఓ బజారి విధులకు సక్రమంగా రాకపోవడం, అడిగిన వారికి పని కల్పించకపోవడం తదితర కారణాలతో డ్వామా పీడీ వెంకటరమణయ్య బుధవారం సస్పెండ్ చేశారు. దీంతో ఇక్కడ ఈసీగా పని చేస్తున్న రఫీక్‌ను ఇన్‌చార్జ్ ఏపీఓగా ఉన్నత అధికారులు నియమించారు.

ఏపీఆర్ఎస్‌లో విద్యార్థి ప్రతిభ



మనోజ్

కోసిగి: మండల కేంద్రం కోసిగికు చెందిన జక్కనగేని వీరారెడ్డి కుమారుడు మనోజ్ ఏపీఆర్ఎస్ ప్రవేశ ప్రవేశ పరీక్షల్లో 88/100 మార్కులు సాధించి ప్రతిభ కనపరిచాడు. మనోజ్ 4వ తరగతి వరకు కోసిగిలో కేజీ ప్రాథమిక పాఠశాలలో చదివాడు. 5వ తరగతి ప్రవేశానికి ఏపీఆర్ఎస్ ఎంట్రెన్స్ పరీక్షల్లో మంచి మార్కులతో ప్రతిభ చూపాడు. విద్యార్థిని క్లాస్ టీచర్ షబానా, ప్రధానోపాధ్యాయులు హేమంత్ బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఈ ఏడాది మార్చి 14వ తేదీన బోయగేరికి చెందిన శేఖర్ చిన్నకుమారుడు హరికృష్ణ(16) ఇద్దరు స్నేహితులతో కలిసి బసాపురంలోని ఎల్లెల్సీ కాలువలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ముగ్గురు ఈత కొడుతుండగా హరికృష్ణ నీటి ఉధృతికి కొట్టుకునిపోయి గల్లంతయ్యాడు. వెంట వెళ్లిన స్నేహితులు సమాచారమివ్వడంతో బంధువులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన గాలింపు చర్యలు చేపట్టారు. మూడో రోజు గల్లంతైన ప్రాంతానికి కొద్ది దూరంలో మృతదేహం కనిపించింది.

ఈనెల 1వ తేదీన పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన రవి, రీట దంపతుల పెద్ద కుమారుడు ప్రిన్స్(05) స్విమ్మింగ్‌పూల్‌లో దిగి మృతిచెందాడు. మండలంలోని ఇస్వీ గ్రామ సమీపంలో తల్లిదండ్రులతో కలిసి ముగ్గురు కుమారులు స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లారు. తల్లి రెండో కుమారుడికి దుస్తులు మారుస్తుండగా, తండ్రి బెలూన్ తెచ్చేందుకు వెళ్లాడు. ఇంతలో పెద్ద కుమారుడు ప్రిన్స్ ఈత కొలనులో దిగాడు. కాళ్లు, చేతులు ఆడించినా ఎవరూ గమనించకపోవడంతో నీటిలో మునిగిపోయాడు. పది నిమిషాల తర్వాత తల్లిదండ్రులు వెతికి స్విమ్మింగ్ పూల్‌లో మునిగిపోయినట్లు గుర్తించారు. వెంటనే బయటకు తీసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రిన్స్ అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

జలగండం..జరభద్రం!

- ఈతకు వెళ్లి మృత్యువాత పడుతున్న విద్యార్థులు, యువకులు
- తల్లిదండ్రుల అప్రమత్తంగా ఉండాలి
- పెద్దలు, నిపుణుల పర్యవేక్షణలో ఈత కొట్టడం ఉత్తమం
- పాడుబడ్డ బావులు, పురాతన చెరువుల్లో ఈతకు వెళ్లరాదని పోలీసుల సూచన



ఎల్లెల్సీలో ఈత కొడుతున్న పిల్లలు, యువకులు

ఆదోని అర్బన్ : వేసవికాలంలో సరదాగా నీటిలో ఆడాలంటే చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు చాలా ఇష్టం. పాఠశాలలు, కళాశాలలకు వేసవి సెలవుల్లో సరదాగా బావులు, కంటలు, వాగులు, చెరువుల వద్దకు స్నేహితులతో కలిసి ఈతకు వెళ్తున్నారు. కొందరికి ఈత రాగా, మరికొందరు ఈత రాకపోయినా సరదాగా నీటి అంచున ఉండి ఆడుతుంటారు. ప్రమాదవశాత్తు నీటిలో జారి పడిపడటం, సమయానికి అక్కడ పెద్దవాళ్లు ఎవరూ లేకపోవడంతో ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ ఉన్నాయి. ప్రతిఏటా ఇలాంటి ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పెద్దల పర్యవేక్షణ తప్పనిసరి

ప్రస్తుతం డివిజన్ పరిధిలో జలాశయాలు, చెక్‌డ్యాంలు, ఎల్లెల్సీ కాలువలు, చెరువులు, కుంటలు, వాగులు, నదులు, బావులన్నీ నీటితో కళకళ్లాడుతున్నాయి. వాటి వద్ద ఎలాంటి రక్షణ చర్యలు లేవు. ప్రస్తుతం వేసవి సెలవులు ఉండటంతో వాటిలో పిల్లలు, యువత, పెద్దలు సరదాగా ఈత కొడుతున్నారు. ప్రమాదవశాత్తు పూడికలో ఇరుక్కుపోతే మృత్యువాత పడే ప్రమాదం ఉంది. అయితే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు లేకుండా పిల్లలు నీటి వద్దకు వెళ్లకుండా కనిపెడుతూ జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. పిల్లలు బయటికి వెళ్తే తప్పకుండా చెప్పి వెళ్లేలా అవగాహన కల్పించాలని, పర్యవేక్షణ లేకుండా ఈతకు అనుమతించరాదని సూచనలు చేస్తున్నారు. జరగరానిది జరిగితే బాధపడడం కన్నా జాగ్రత్తతోనే జలగండం నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు.



బసాపురం ఎల్లెల్సీ కాలువలో గల్లంతైన యువకుడి కోసం వెతుకుతున్న అగ్నిమాపక సిబ్బంది (ఫైల్)

ఈత రాని వారు బావుల వద్దకు వెళ్లవద్దు



ఈత రాని వారు ఎవరైనా సరే బావులు, చెరువుల వద్దకు వెళ్లరాదు. అంతేగాకుండా తల్లిదండ్రుల అనుమతి లేకుండా, మద్యం సేవించి, సెల్ఫీల కోసం నీటిలో దిగడం ప్రమాదం. లోతట్టు, ఉద్రిక్తంగా ప్రవహించే నీటిలో దిగి ప్రాణాలుమీదికి తెచ్చుకోవద్దు. బావిలో, చెరువుల్లో పై నుంచి ఎగరడం లాంటివి చేస్తే నీటిలో పూడు, రాళ్లు ఉండడం వల్ల కాళ్లు, తలకు దెబ్బలు తగిలి పూడులో ఇరుక్కోవడం వల్ల ప్రాణాలు కోల్పోవచ్చు. వేసవి సెలవుల్లో పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలి. – రాజశేఖర్‌రెడ్డి, టూటౌన్ సీఐ

తీసుకోవలసిన జాగ్రత్తలు

- మనిషి మునగని నీటిలో ఈత నేర్చుకోవాలి. స్నేహితులతో పోటీ పెట్టుకొని నీటితో చెలగాటమాడరాదు. బాగా ఈత వస్తేనే వెళ్లాలి.
- ఈత నేర్చుకునేందుకు, సరదాగా ఈత కొట్టేందుకు స్విమ్మింగ్ పూల్ సురక్షిత ప్రదేశం. అక్కడ కూడా గైడ్ పర్యవేక్షణలోనే నేర్చుకోవాలి.
- పాడుబడ్డ బావి, చెరువుల్లో ఈత కొట్టడానికి వెళ్లరాదు. అందులో పూడిక, పాచు, అన్నిరకాల పూల మొక్కలు ఉంటాయి. అవికాళ్లకు చుట్టుకొని మునిగిపోయేలా చేసి ప్రాణాలు తీస్తాయి.
- ఎల్లెల్సీ, హెచ్ఎల్‌సీ కాలువల్లో ఈత కొట్టరాదు. నీటి ప్రవాహ వేగానికి కొట్టుకునిపోయే ప్రమాదం ఉంటుంది. ఈత వచ్చినా కొట్టే పరిస్థితి ఉండదు.
- ఈత నేర్చుకునే వారు వీపుకు బెండ్లు వేసుకోవాలి.
- తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఈత నేర్చుకోవడం మంచింది.
- ఈత నేర్చుకునేందుకు పిల్లల్ని ఇతరులతో పంపించరాదు. ఈత వచ్చిన కుటుంబ సభ్యులతో మాత్రమే పంపాలి.

కోతకు గురైన రోడ్డును చదును చేయాలి



కోతకు గురైన రోడ్డును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ఆదోని రూరల్: ఆదోని – మాధవరం రహదారిలో గణేకల్లు నుంచి కుప్పగల్ వరకు ఆర్అండ్‌బీ రోడ్డు ఇరువైపులా కోతకు గురైందని, అధికారులు స్పందించి గరుసు వేసి చదును చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కె.లింగన్న, కార్యదర్శివర్గ సభ్యులు బి.వీరారెడ్డి డిమాండ్ చేశారు. కోతకు గురైన రోడ్డును గురువారం వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ వాహనదారులు సైడుకు వెళ్లడానికి చాలా ఇబ్బందిగా ఉందన్నారు. రెండు నెల క్రితం పాండవగల్ వద్ద ప్రమాదం జరిగిందని, భవిష్యత్ ఇలాంటి ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు పాండురంగ, పార్టీ సభ్యులు కె.నర్సిరెడ్డి, హుసేని, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించండి



నాగలదిన్నెలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ నూర్జహాన్

నందవరం : గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరించాలని డీఎల్‌పీఓ నూర్జహాన్ సూచించారు. గురువారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గ్రామాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దటి రానివొద్దని, బోర్లు, చేతి పంపులు, లీకైనా పైపులైన్లు మరమ్మత్తులు చేయించాలన్నారు. ఎప్పటికప్పుడు మురుగు కాలువలు, నీటి కుంటలు, వాటర్ ట్యాంకులు శుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ సందీప్, పంచాయతీ కార్యదర్శులు విజయలక్ష్మి, నొసన్న, సుజాత తదితరులు పాల్గొన్నారు.

దర్గాకు తరలివచ్చిన భక్తులు



పూజలందుకుంటున్న ఖాదర్‌లింగస్వామి

కౌతాళం: కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు అధికంగా తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. మంగళవారం ఉరుసు ఉత్సవం పూర్తి కావడంతో ఉరుసులో భక్తుల రద్దీ వల్ల రాని భక్తులు స్వామి సన్నిధిలో మొక్కుబడులు తీర్చుకునేందుకు గురువారం అధికంగా తరలివచ్చి పిండివంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

సబ్సిడీపై పశుగ్రాసం

గోనెగండ్ల : పాడి రైతులకు సబ్సిడీపై పశుగ్రాసం అందజేస్తున్నట్లు పశువైద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం స్థానిక రైతు సేవా కేంద్రం లో పాడి రైతులకు సబ్సిడీ కింద పశుగ్రాసం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలానికి 72 పశుగ్రాసం బ్యాగులు వచ్చాయన్నారు. ఒక్కో బ్యాగులో 50 కేజీల గ్రాసం ఉంటుందన్నారు. ఒక బ్యాగు ధర రూ.1,150 కాగా రైతులకు 50 శాతం సబ్సిడీ కింద అందజేస్తున్నట్లు తెలిపారు. 72 బ్యాగులో గోనెగండ్లకు 40 బ్యాగులు, ఐరన్‌బండ, గంజిహళ్లి, బి. అగ్రహారం, బైలుప్పల గ్రామాలకు 8 బ్యాగుల చొప్పున పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మిగిలిన గ్రామాలకు త్వరలో పశుగ్రాసం బ్యాగులను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఇందిర, సర్పంచ్ హైమవతి పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యపరిచేది కళాకారులే



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆదోని రూరల్: ప్రజలను చైతన్యపరిచేది ప్రజా కళాకారులేనని ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు వెంకటరాముడు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రయ్య, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య అన్నారు. ఏపీ ప్రజానాట్యమండలి జిల్లాస్థాయి శిక్షణ తరగతులు గురువారం స్థానిక శ్రీ విశ్వనారాయణ జూనియర్ కళాశాలలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి సీనియర్ నాయకులు శివరాములు పతాకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. సమాజంలో చెడుని అవినీతిని ప్రభుత్వ విధానాలను ప్రజలకు పాటల ద్వారా తెలియజేసేది ప్రజా నాట్యమండలి కళాకారులేనని చెప్పారు. యువత శిక్షణ పొందాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకన్న, విజయ్, పీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొత్తూరు గంగన్న, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి

ఆదోని అర్బన్: కళాకారులను ప్రోత్సహించాలని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ జాతర సందర్భంగా ఈనెల 19న మున్సిపల్ గ్రౌండ్‌లో లలిత కళాసేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దశమంతములు నాటక ప్రదర్శనకు రావాలని కళాకారులు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కార్యక్రమంలో కళాకారులు నల్లారెడ్డి, తాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కొత్తరేషన్ కార్డుకు కష్టాలు



కొత్తరేషన్ కార్డు దరఖాస్తు కోసం వేచివున్న ప్రజలు

నందవరం: కొత్త రేషన్ కార్డులు, రేషన్ కార్డులో మార్పులు, చేర్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే ఆయా గ్రామాల్లో ప్రజలు సచివాలయాల వద్దకు రేషన్ కార్డు కోసం వెళ్తే కష్టాలు తపడం లేదు. రేషన్ కార్డుల సైట్ సర్వర్ లేక అవస్థలు పడుతున్నారు. గురువారం మండల కేంద్రం నందవరం సచివాలయం–1లో కొత్తరేషన్ కార్డు, రేషన్ కార్డులో మార్పులు చేర్పుల కోసం ప్రజలు బారులు తీరారు. చంటి బిడ్డలతో బాలింతలు రేషన్ కార్డుల మార్పుల కోసం క్యూలో నిల్చున్నారు. అయితే సర్వర్ లేక పోవడంతో సిబ్బంది, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోజుల తరబడి సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా.. సర్వర్ సమస్యతో అధికారులు సైతం సతమతమవుతున్నారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు సమాధానం చెప్పలేక నీళ్లు నములుతున్నారు. ఇలాగే కొనసాగితే రేషన్‌కార్డు కష్టాలు తీరే పరిస్థితి లేదు. ప్రభుత్వం స్పందించి సర్వర్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్యలపై దృష్టి సారించండి

మంత్రాలయం రూరల్ : వేసవి దృష్ట్యా మండలంలోని ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్యలపై దృష్టి సారించాలని డీఎల్‌పీఓ నూర్జహాన్ ఆదేశించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నీళ్ల ట్యాంకులు, పైపులైన్ లీకేపీలపై శ్రద్ధ వహించాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ జారీ చేసిన ఆన్‌లైన్ పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. మండల కేంద్రంలో కూలిన వాటర్ ట్యాంకు పంచాయతీకి అప్పగించలేదని స్పష్టం చేశారు. సమీక్షలో ఎంపీడీఓ బి.నూర్జహాన్, అసిస్టెంట్ ఎంపీడీఓ ఈశ్వరయ్యస్వామి, పంచాయతీ కార్యదర్శులు ఇష్రాద్‌బాషా, వేణుగోపాల్, స్వామినాథ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్రం

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని రైతు కూలీ సంఘ జిల్లా కార్యదర్శి ఏసేపు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి హనీఫ్ ఆరోపించారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చారు మాట్లాడారు. కేంద్రం అమల్లోకి తెచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేసి కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా కార్మికుల హక్కులు, సమస్యలపై ఈనెల 20న చేపట్టే దేశవ్యాప్త కార్మిక సమ్మెలో కార్మిక, ఉద్యోగ వర్గాలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ నాయకులు చిన్న రామలింగ, రైతు కూలీ సంఘ నాయకులు జయన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలి

ఆదోని టౌన్: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని అఖిల భారత రైతు కూలీ సంఘం, భారత కార్మిక సంఘాల సమాఖ్య, ఏఐటీయూసీ సంఘాల నాయకుల నాయకులు డిమాండ్ చేశారు గురువారం ఆయా సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట సమావేశం జరిగింది. సీఐటీయూ నాయకులు ఈరన్న, గోపాల్, వెంకన్న, హుసేని, ఐఎఫ్‌టీయూ నాయకులు వెంకప్ప, కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు వై.పి.గంగాధర్, తాయన్న మాట్లాడారు. నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పాత కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. నూతన వ్యవసాయ మార్కెటింగ్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలన్నారు.

కాలువ పనులకు భూమిపూజ

కౌతాళం: తుంగభద్ర దిగువ కాలువ కింద ఉన్న డీపీ మరమ్మతుల పనులకు గురువారం మంత్రాలయం నియోజకవర్గ నాయకుడు రాఘవేంద్రరెడ్డి తుంగభద్ర బోర్డు ప్రాజెక్టు చైర్మన్ టిప్పుసుల్తాన్‌లతో కలిసి భూమిపూజ చేశారు. వారు మాట్లాడుతూ డీపీ 65 కాలువ మరమ్మతులు గ్రావెల్ పనులు చేపట్టడానికి ప్రభుత్వం 1.62కోట్లు విడుదల చేసింది. కార్యక్రమంలో వెంకటపతిరాజు, ఆడివప్పగౌడ్, సతీష్‌నాయుడు, సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా బట్టీలు ధ్వంసం



నాటుసారా డ్రమ్ములను ధ్వంసం చేస్తున్న సీఐ, పోలీసులు

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని రణమండల కొండల చుట్టూ ఉన్న సింగరాజుమల్ల కొండలు, తాయమ్మ బైలు, సముద్రపు కుంట ప్రాంతాల్లో దాడులు నిర్వహించి నాటుసారా తయారు చేస్తున్న 9 మందిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ గురువారం తెలిపారు. ఈ దాడుల్లో 80 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 6 వేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. 30 ప్లాస్టిక్, ఇనుప డ్రమ్ములను ధ్వంసం చేశామన్నారు. ఆదోని పట్టణానికి చెందిన బోయ మురళి, బోయ ఎర్రమ్మ, బోయ నాగమ్మ, బోయ సురేష్, బోయ రాజు, ఎర్రమ్మ అలియాస్ జాలిమంచమ్మ, బోయ రమేష్, బోయ మద్దిలేటి, బోయ తిమ్మప్పలపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా అక్రమంగా నాటుసారా తయారు చేసినా, అమ్మినా కేసులు నమోదు చేసి జైలుకు తరలిస్తామని సీఐ హెచ్చరించారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

‘పులికనుమ’ నుంచి ఇంటింటికీ నీరు

ఆదోని అర్బన్: జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ తాగునీటిని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేసిందని ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదోని, మంత్రాలయం నియోజకవర్గాల్లో నీటి సమస్య పరిష్కారానికి పులికనుమ రిజర్వాయర్ నుంచి పైపులైన్ వేస్తామన్నారు. 163 గ్రామాలకు మంచినీటి సమస్య లేకుండా ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు చేసి 0.583 టీఎంసీల నీటిని సరఫరా చేయనున్నట్లు తెలిపారు. రెండు నియోజకవర్గాలకు కలిపి 30 గ్రామాల్లో ఉపరితల ట్యాంకులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆదోని నియోజకవర్గంలో 4 ఉపరితల ట్యాంకులను ఏర్పాటు చేసేందుకు 4 గ్రామాలను ఎంచుకున్నామన్నారు. పెద్దతుంబళం, జి.హొసళ్లి, రంగాపురం, ఆరేకల్ గ్రామాల్లోని కొండలపైన ట్యాంకులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నాలుగు ట్యాంకులకు ఆదోని నుంచి 20 కి.మీ. దూరంలో ఉన్న పులికనుమ రిజర్వాయర్ నుంచి పైపులైన్లు వేసి నీటి సరఫరా జరిగేలా పనులు చేపడతామన్నారు. రెండు, మూడేళ్లలో పనులు పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో కూటమి నాయకులు విట్టా రమేష్, భూపాల్‌చౌదరి, శ్రీకాంత్‌రెడ్డి, రేణువర్మ, పులిరాజు, చెన్నబసప్ప, విజయ్‌కృష్ణ, ఉపేంద్ర, దేశాయ్ చంద్రన్న తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టండి

గోనెగండ్ల: గత ప్రభుత్వంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ మణి మంజరి సూచించారు. గురువారం మండల పరిధిలోని గంజిహళ్లి, అయ్యకొండ గ్రామాలలో హౌసింగ్ ఏఈతో కలిసి ఎంపీడీఓ పర్యటించారు. ఆమె మాట్లాడుతూ మండలంలో గత ప్రభుత్వ హయాంలో 1176 ఇళ్లు మంజూరయ్యాయని, ఇందులో 443ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాని మిగతావి వివిధ స్టేజ్‌లలో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



రాజు కుటుంబ సభ్యులకు రూ.4లక్షల చెక్కును అందిస్తున్న పెట్రోల్ బంక్ మేనేజర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎంజీ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన కార్మికుడు రాజు కుటుంబ సభ్యులకు పెట్రోల్ బంక్ యాజమాన్యం గురువారం రూ.4లక్షల ఆర్థిక సహాయం అందించింది. ఈనెల 13వ తేదీన పెట్రోల్ బంక్‌లో పనిచేస్తూ మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో మృత దేహంతో పెట్రోల్ బంక్ వద్ద ఆందోళన చేశారు. దీంతో స్పందించిన పెట్రోల్ బంక్ యాజమాన్యం మృతుడి భార్య మంజులకు రూ.4లక్షల చెక్కును పెట్రోల్ బంక్ మేనేజర్ ఈరన్న, జయరాం, విశ్వనాథ్‌లు అందించారు. తమను ఆర్థికంగా ఆదుకున్న పెట్రోల్ బంక్ యాజమాన్యానికి, సహకరించిన సీపీఐ నాయకులకు రాజు కుటుంబసభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, మంత్రాలయం తాలూకా కార్యదర్శి భాస్కర్ యాదవ్, నాయకులు బజారి, మల్లికార్జున గౌడ్, మాజీ కౌన్సిలర్ మధుబాబు పాల్గొన్నారు.

అక్రమంగా పైప్‌లైన్ వేసుకుంటే చర్యలు



పైపులను పగలగొడుతున్న ఎల్ఎల్‌సీ సిబ్బంది

పెద్దకడబూరు : మండల పరిధిలో ఉన్న ఎల్ఎల్‌సీ నుంచి అక్రమంగా పైప్‌లైన్ వేసుకుంటే చర్యలు తీసుకుంటామని టీబీపీ పీటీ సెక్షన్ మండల ఏఈ రామాంజినేయులు హెచ్చరించారు. గురువారం ఎల్ఎల్‌సీపై తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని మేకడోణ గ్రామానికి చెందిన నానాయకట్టు రైతులు నరసన్న, ఆనంద్ ఎల్ఎల్‌సీ ప్రధాన కాలువపై 277.650 కిలోమీటరు వద్ద అక్రమంగా పైప్‌లైన్‌లు వేసుకున్నట్లు తమ సిబ్బంది ఓబులేసు, గులాం మొద్దీన్ గుర్తించారన్నారు. వెంటనే కాలువను తవ్వి పైప్‌లైన్‌లు తొలగించి వాటిని పగలగొట్టడం జరిగిందన్నారు. అక్రమాలకు పాల్పడ్డ రైతులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?



అధికారులతో మాట్లాడుతున్న కౌన్సిలర్ బాలాజీయాదవ్

ఆదోని టౌన్: ఆదోని పట్టణంలోని 29వ వార్డు బీఎన్ టాకీస్ ఎదురుగా సందులో ఆర్అండ్‌బీ డివిజనల్ ఆఫీసు పక్కనే పైపులైన్ ఏర్పాటుకు గుంతను తవ్వి వదిలేశారు. వర్షాకాలం కావడంతో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులంటూ ఆ వార్డు కౌన్సిలర్ బాలాజీయాదవ్, డీఈ గోపీనాథ్, ఏఈ జనార్దన్ ప్రశ్నించారు. గురువారం మున్సిపల్ ఎంఈ ఇంతియాజ్‌బాషా చాంబర్‌లో కౌన్సిలర్ బాలాజీ అధికారులతో వాగ్వాదం చేశారు. నాలుగైదు రోజులుగా పైపులైన్ కోసం గుంతను తవ్వి వదిలేశారని, పనులు సకాలంలో పూర్తి చేయలేనప్పుడు గుంతను ఎందుకు తవ్వారని ఎంఈ, డీఈలను నిలదీశారు. రెండు రోజుల్లోగా పనులు పూర్తి చేస్తామన్నారు.